పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ సక్రమంగా ఉండాలి

స్వచ్ఛ సర్వేక్షణ్ సమావేశంలో జెడ్‌సీ మమత


సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ మమత

కూకట్‌పల్లి: స్వచ్ఛ సర్వేక్షణ్–2023పై జోనల్ కమిషనర్ వి.మమత పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో అవగాహన కల్పించారు. జీహెచ్‌ఎంసీకి మంచి ర్యాంక్ రావడానికి చేపట్టాల్సిన పనులపై సంబంధిత అధికారులకు వివరించారు. స్వచ్ఛ ఆటోలకు రెండు కంపార్ట్‌మెంట్‌లతో పాటు పై కప్పు ఉండేలా చూడాలన్నారు. నాలాలు, చెరువులు, కుంటల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాలయాల నుంచి వచ్చే పూలతో వస్తువులను తయారు చేయటం.. చెట్ల ద్వారా వచ్చే చెత్తపై ఎరువులు తయారు చేయటం... భవన నిర్మాణ వ్యర్థాలను తిరిగి వాడటంపై అవగాహన కల్పించారు. 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను నిషేధించామన్నారు. అదే విధంగా పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బస్తీ దవాఖానాలు, అన్నపూర్ణ క్యాంటీన్‌లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కమిషనర్లు, శానిటేషన్, డీసీలు, సహా వైద్యాధికారులు, ఈఎ స్‌లు, జవాన్లు, ఎస్‌ఎఫ్‌ఏ, ఎస్‌ఆర్‌పీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

8న మహిళలకు వర్క్‌షాప్

బాలానగర్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలానగర్‌లోని ఎంఎస్‌ఎంఈలో ఈనెల 8వ తేదీన మహిళలకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఎంఎస్‌ఎంఈ అడిషనల్ డైరెక్టర్ సుధీర్ కుమార్ తెలిపారు.వర్క్‌షాప్‌లో జీఎస్‌టీ రిజిస్ట్రేషన్, రిటర్న్స్ ఫైలింగ్, ఈ–రిజిస్ట్రేషన్, ఈ–మార్కెటింగ్, ఎంఎస్‌ఎంఈ స్కీమ్స్ గురించి ఈ వర్క్‌షాప్‌లో వివరిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు 040–23078131, 32, 33లలో సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

బాలానగర్: అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని బుధవారం బాలానగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో సమ్మె చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడారు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో ఇక్కడి ప్రభుత్వాలు అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి హెల్త్ కార్డులను కూడా అందించారని పేర్కొన్నారు. అదే విధంగా మన రాష్ట్రంలోనూ అలాగే గుర్తించాలన్నారు. ఈ ధర్నాలో 152 మంది ఉద్యోగులు పాల్గొని తహసీల్దార్‌కు వినతి పతం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జగన్, టీచర్లు, హెల్పర్లు వసంత, జైతున్, స్రవంతి, సంగీత, అనురాధ, రమాదేవి, స్వప్న, యమున, లావణ్య, సారిక, లక్ష్మీసౌజన్య, శ్వేత, దస్తగిరమ్మ, రజిత పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి


కేపీహెచ్‌బీ విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

జేసీ సైబర్ సిటీ చైర్మన్ రామ్మోహన్

కూకట్‌పల్లి: విద్యుత్ ఉద్యోగుల పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని కేపీహెచ్‌బీ సంస్థ కార్యాలయం వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ మేరకు బుధవారం కూకట్‌పల్లి, కొండాపూర్, గచ్చిబౌలి డివిజన్‌లలోని ఉద్యోగుల ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీలోని సంస్థ కార్యాలయం వద్ద డీఈ, ఏఈలతో పాటు 500 మంది ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యను పరిష్కరించి పీఆర్‌సీని వెంటే అమలు చేయాలన్నారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గతేడాది ఏప్రిల్ వరకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సైబర్ సిటీ జేఏసీ చైర్మన్‌రామ్మోహన్, కన్వీనర్ ఏడీ శ్యాంప్రసాద్, కోకన్వీనర్ వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ ఆర్.రాధాయ్య, పరశురామ్, మధుసూదన్‌రావు, ఏఈ శ్రీనివాస్, దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం పేదల నడ్డి విరుస్తోంది

ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు

సాక్షి, మేడ్చల్ జిల్లా: కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం నిత్యావసర వస్తువులతో పాటు గ్యాస్ ధరలను పెంచుతూ పేద ప్రజల నడ్డి విరుస్తోందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షు డు, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు ఆరోపించా రు. రూ.500 ఉన్న గ్యాస్ సిలిండర్ ఎనిమిదేళ్ల మోదీ ప్రభుత్వం పలుమార్లు పెంచుతూ సామాన్యులపై భారం మోపుతుందన్నారు. నిన్నటి వరకు రూ.1130 ఉన్న గ్యాస్ ధర బుధవారం మరో రూ.50 పెంచడంతో రూ.1180కి ఎగబాకిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక వి ధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పేలా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించేంత వరకు బీఆర్ఎస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని ఎమ్మెల్సీ రాజు హెచ్చరించారు.

నియంతృత్వ బీఆర్‌ఎస్ పాలనకు అడ్డుకట్ట వేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్మనపల్లి సూర్యరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు శక్తి కేంద్రాల్లో బుధవారం స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అర్మనపల్లి సూర్యరావు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో నడుస్తున్న కుటుంబ పాలనను అంతం చేయడానికి బీజేపీ కంకణం కట్టుకుందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీపై బీజేపీ చేస్తున్న పోరాటాన్ని ప్రజల్లోకి విస్తతంగా తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. కార్యకర్తల సేవలను ఎప్పుడు గుర్తు పెట్టుకొని వారికి తగిన గౌరవం ఇస్తున్నామన్నారు. వెంకట్రావునగర్, శేషాద్రినగర్, శాంతి నగర్‌కాలనీలకు సంబంధించిన బూత్‌లలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు నాయినేని పవన్‌కుమార్ అధ్యక్షతన వెంకట్రావునగర్‌లోని చింతపట్ల వెంకయ్య పార్కు వద్ద జరిగిన సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు అనంత నాగరాజు, సీనియర్ నాయకులు జి. పాపారావు, ఐడియల్ సుధాకర్, కొండయ్య చౌదరి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా కరపత్రం ఆవిష్కరణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 11న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా కరపత్రాన్ని బుధవారం ఎమ్మెల్యే జర్నలిస్టు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వివేక్‌నగర్‌కాలనీ ద్వాదశ జ్యోతిర్లింగ శివాలయం ప్రాంగణంలోని పుల్లారి వాసుగారి కల్యాణ మండపంలో ఈ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈజాబ్ మేళాలో 56 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. 10వ తరగతి నుంచి ఎంబీఏ విద్యార్హత ఉన్న వారు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సప్తగిరి కాలనీలోని చిత్తారమ్మ గుడి దగ్గర వెలసిన శ్రీమల్లికార్జున స్వామి, భ్రమరాంబిక, గొల్లకేతమ్మ దేవాలయం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అదే విధంగా నిర్వహించిన స్వామివార్ల కల్యాణ మహోత్సవంలో బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్ల కురుమ సంఘం సభ్యులు ఆయనకు శాలువా కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు గండి మల్లేష్‌యాదవ్, వినోద్‌యాదవ్, మనోజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులకు తీవ్ర అన్యాయం'

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఐదేళ్లకోసారి సవరించాల్సిన కనీస వేతనాల చట్టాన్ని పదిహేనేళ్లైనా సవరించకుండా కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యా యం చేస్తోందని, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని సీఐటీయూ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎ.అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. అశోక్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయా లని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని అందజేశారు.

'ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రీతి మృతి'

సాక్షి,మేడ్చల్ జిల్లా: కాలేజీ యాజమాన్యంతో పాటు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే వరంగల్ పీజీ మెడికల్ విద్యార్థిని ప్రీతి మృతి చెందిందని ఐసీఈయూ హైదరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, ఉమెన్ కన్వీనర్ మైథిలి ఓ ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు.

యోగా భవనానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ 6వ ఫేజు శివాలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న యోగా భవనానికి బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణ దాతలు డాక్టర్ సి. నిహార్ దంపతులను ఎమ్మెల్యే కృష్ణారావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భవిష్యత్ తరాలకు మనం అందించే ఆస్తిపాస్తులు ఆరోగ్యమేనని అన్నారు. ప్రతి రోజు గంట సేపు వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు సాయిబాబు చౌదరి, శ్యామలరాజు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సూపర్‌వైజర్ నర్సింహులు, విద్యార్థులు

ఆల్విన్‌కాలనీ: పెంపుడు జంతువులు, మూగజీవాల పట్ల ప్రేమతో మెలగాలని.. వాటి పట్ల దురుసుగా ప్రవర్తిస్తే వాటి రక్షణ కోసం దాడులు చేస్తాయని.. జాగ్రత్తగా వ్యవహరించాలని కూకట్‌పల్లి ఎంటమాలజీ సూపర్‌వైజర్ నర్సింహులు సూచించారు. బుధవారం కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డిప్యూటీ కమిషనర్ సూచనల మేరకు వీధికుక్కలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వీధి కుక్కలు వీధుల్లో తిరుగుతున్నప్పుడు వాటిని బెదిరించొద్దన్నారు. తినుబండారాలు తీసుకొని వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చిన్నారులను వీధుల్లో ఒంటరిగా తిరగకుండా తల్లిదండ్రులు చూడాలన్నారు. వీధి కుక్కలు దాడికి దిగడానికి వస్తే పరుగులు తీయకుండా అక్కడే నిల్చుంటే అవి ఏమీ అనవన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రీట్ కార్నర్ మీటింగ్


వివేకానందనగర్ సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్ శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్‌ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ చంద్రారెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవరం కాంతరావు పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపటం ఖాయమన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రతి ఒక్కరికి వివరించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ సుదర్శన్ ముదిరాజ్, నాయకులు రాజేశ్వరావు, విజయ్‌కుమార్, హరికృష్ణ, ఉపాధ్యక్షుడు కృష్ణ శర్మ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి


ఏఎస్‌రాజునగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఏఎస్‌రాజు నగర్ కాలనీలో రూ.9లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. హైదర్‌నగర్ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని ఆయన అన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాంట్రాక్టర్ బాబురావు, కాలనీవాసులు వేదమూర్తి, చైతన్య, రాయపరెడ్డి, శ్రీనివాస్, ఉమాశంకర్, శేషయ్య, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

'హాత్ సే హాత్ జోడో'

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ప్రతిపక్ష పార్టీ నాయకులపై దాడులు చేయడం అప్రజాస్వామికమని టీపీసీసీ సభ్యులు డాక్టర్ సత్యం శ్రీరంగం అన్నారు. 9వ రోజు 'హాత్ సే హాత్ జోడో' అభియాన్ యాత్రలో భాగంగా బుధవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, ఏ–బ్లాక్ అధ్యక్షుడు పి.నాగిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రాజేందర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

బాలానగర్: ప్రజలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. బుధవారం శోభనకాలనీలో రోడ్ నం.4లో మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, సాధారణ వ్యాధులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. పంటి సమస్యలకు డెంటల్ హాస్పటల్‌కు రావాలని సూచించారు.

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎలమ్మబండ, సుభాష్ చంద్రబోస్‌నగర్‌లో ఓమ్ని ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఆస్పత్రి సీఓఓ మంజునాథ్ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, పల్స్ రేట్ తదితర ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు రాసి ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యులు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ... ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వ్యాయామం తప్పకుండా చేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సురేంద్ర, ఓమ్ని సిబ్బంది పాల్గొన్నారు.


మందులను అందజేస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్



బీజేపీ ప్రభుత్వం సామాన్యుడికి ఉరితాడు బిగిస్తోంది

సాక్షి,మేడ్చల్ జిల్లా: కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో నిత్యావసరాల ధరలు పెంచుతూ సామాన్య ప్రజలకు ఉచ్చు బిగిస్తోందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ ధర పెంచడం దారుణమని, మహిళా దినోత్సవం సందర్భంగా గ్యాస్ ధరలు పెంచి మహిళలకు మోదీ ప్రభుత్వం కానుక ఇచ్చిందని ఆయన ఎద్దేవా చేశారు. కార్మిక, కర్షక, పేద, మధ్య తరగతి ప్రజలపై కక్ష గట్టిన కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని మంత్రి పిలుపునిచ్చారు.